క్లుప్తంగా

సత్కారం



బిందును సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

పాల్వంచరూరల్: జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన కాటూరి బిందును మంత్రులు పూల మాలలతో ఘనంగా సత్కరించారు. మండల పరిధి దంతలబోరు గ్రామానికి చెందిన న్యాయవాది కాటూరి సంజీవరావు, సుశీల దంపతుల కుమార్తె బిందు తొలిప్రయత్నం లోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సందర్భంగా శనివారం స్థానిక కేటీపీఎస్ గెస్టహౌజ్‌కు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ ఆర్.రాఘురాంరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులను బిందు కలవగా అభినందించి సత్కరించారు. సంగీత, సంకీర్తన, విజయకుమార్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు ప్రగతి నిర్దేశకులు



మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభుదయాళ్

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయుడు ఎల్లవేళలా నిత్య విద్యార్థిగా ఉండాలని, ఉత్తమ పౌరులను సమాజానికి అందించే బాధ్యత ఉపాధ్యాయులదేనని, ఉపాధ్యాయులు ప్రగతి నిర్దేశకులని ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్ అన్నారు. పాత కొత్తగూడెం జిల్లా విద్యా శిక్షణ సంస్థలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల ప్రత్యేక శిక్షణ శిబిరంలో శనివారం ఆయన పాల్గొని పలు విద్యా విషయాలను, నూతన విద్యా పోకడలను వివరించారు. ఈ నెల 20 నుండి 24 వరకు నిర్వహించే మండల స్థాయి శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా, సౌకర్యవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ శిబిరంలో జిల్లా స్థాయి, మండల స్థాయి రిసోర్స్‌పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్త బదిలీ విధానాన్ని రద్దుచేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులను మానసిక వేదనకు గురిచేస్తున్న కొత్త బదిలీ విధానాన్ని రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ, రాష్ట్ర కనీస వేతన సలహా మండలి జనరల్ జనక్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సింగరేణి యాజమాన్యం ఇటీవల విడుదల చేసిన బదిలీ పూర్తిగా కార్మికుల అభ్యున్నతికి వ్యతిరేకంగా ఉందని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధానంగా పర్చేజ్ డిపార్ట్‌మెంట్, కోల్ బ్రాంచ్, స్టోర్స్, రిక్రూట్‌మెంట్ వంటిశాఖల్లో పనిచేసే ఉద్యోగులు కనీసం నాలుగేళ్ల సేవ పూర్తి చేసిన అనంతరం బదిలీకి అర్హులన్న నిబంధన తొలగించాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగి బదిలీకోసం కనీసం 3 సంవత్సరాల సేవ అవసరమన్న నిబంధన, ఉద్యోగి జీవితంలో కేవలం రెండు సార్లు మాత్రమే రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ అవకాశం కల్పించటం, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ పదేళ్లలోపు సంబంధిత ఏరియాలో పనిచేసిన అనుభవం ఉండకూడదన్న నిబంధనలు కఠినంగా ఉన్నాయని వీటిని వెంటనే రద్దు చేయాలని కోరారు.

21న జాబ్ మేళా

జూలూరుపాడు: ఈనెల 21న జూలూరుపాడు ఎంపీడీఓ కార్యాలయంలో ఐటీసీ, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, మండల పరిషత్ సూపరింటెండెంట్ తాళ్లూరి రవి, జిల్లా కో ఆర్డినేటర్ వెంకట్రావు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ... 8, 9, 10వ తరగతులు, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదువుకున్న నిరుద్యోగ యువత అర్హులన్నారు. ఎలక్ట్రీషియన్, సోలార్, బ్యూటీషన్, నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, మెకానికల్, డేటాఎంట్రీ ఆపరేటర్ వంటి రంగాల్లో 45 రోజులు ఉచిత శిక్షణ ఇచ్చి, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ సమయంలో ఉచిత హాస్టల్, ఉచిత భోజన వసతి, స్టడీ మెటీరియల్ ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

జూలూరుపాడు: స్థానిక సాయి ఎక్స్‌లెంట్ విద్యాలయం, ఖమ్మం సురక్ష మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జూలూరుపాడులో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో షుగరు, బీపీ, థైరాయిడ్, మోకాళ్లు, మెడ, నడుము నొప్పులు, చెవి, ముక్కు, గొంతు సంబంధిత సమస్యలతోపాటు, స్త్రీలకు సంబంధించిన సమస్యలకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఖాళీగా మున్సిపల్ జాగలు!

పాత నిర్మాణాలు కూల్చడంతో నిరుపయోగంగా స్థలాలు

- ప్రైవేట్ పార్కింగ్‌కు వినియోగం
- ఆదాయమార్గాలపై నిర్లక్ష్యం వీడని అధికారులు
- శోభ తెచ్చే పార్కు కాగితాలకే పరిమితం



సెవెన్‌హిల్స్‌లోని మున్సిపల్ స్థలంలో నిలిపిన వాహనాలు

కొత్తగూడెం అర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల్లో నిరుపయోగంగా మున్సిపాలిటీకి సంబంధించిన అనేక స్థలాలు ఉన్నాయి. గతంలో ఆయా స్థలాల్లో శిథిలావస్థ బిల్డింగులు ఉండేవి, వాటి స్థానంలో కొత్తవి నిర్మించి చిరు వ్యాపారులకు అద్దెలకు ఇస్తామని మున్సిపల్ అధికారులు వాగ్దానాలు చేసి వాటిని కూల్చేశారు. కానీ ఆయా స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టలేదు. దీంతో ఆయా స్థలాలను ప్రైవేటు వ్యాపారస్తులు వారి హోటళ్లకు వచ్చే కార్లు, ఇతర వాహనాల పార్కింగ్ కోసం వినియోగించుకుంటున్నారు. దీంతో పాటుగా కొంత మంది కాంట్రాక్టర్లు ఆయా స్థలాలను డంపింగ్‌యార్డులు ఉపయోగించుకుంటూ, వారు చేసే నిర్మాణాలకు మున్సిపల్ స్థలాల్లో ఇసుక, కంకర వంటివి డంపింగ్ చేసి నిల్వ ఉంచుకుంటున్నారు. మున్సిపాలిటీకి, ప్రజలకు, అద్దె చెల్లించే వ్యాపారులకు తప్ప మిగతా ప్రైవేటు వ్యాపారాలు చేసుకునే వారికి ఆయా స్థలాలు బాగా ఉపయోగపడుతున్నాయి.

అందుబాటులోకి వస్తే ఆదాయమే..

గతంలో చేసిన ప్లానింగ్ ప్రకారం ఖాళీ స్థలాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపడితే చిరు వ్యాపారులకు ఉపాధితో పాటుగా ప్రజలకు అన్నీ రకాల సేవలు అందుబాటులోనికి వచ్చే అవకాశం ఉంటుంది. మున్సిపాలిటీకి కూడా అద్దె రూపంలో ప్రతీ ఏడాది అదనంగా ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. కొత్తగూడెం మున్సిపాలిటీ త్వరలో కార్పొరేషన్ కాబోతున్న నేపథ్యంలో ఆదాయ మార్గాలపై దృష్టి సారిస్తే, కొత్తగూడెం అభివృద్ధితో పాటుగా పలువురికి ఉపాధి అవకాశాలు లభించే వీలు ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థలాలను వినియోగంలోనికి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ సుజాతను ఫోన్‌లో వివరణ కోరే ప్రయత్నం చేయగా అందుబాటులోని రాలేదు.

మున్సిపల్ ఖాళీ స్థలాలు ఇలా..

మున్సిపాలిటీ పరిధిలోని సెవెన్‌హిల్స్ ఏరియా చర్మకారుల సంఘానికి సంబంధించి దాదాపు 40 పైగా కమర్షియల్ కాంప్లెక్స్‌లుండేవి. వాటిలో కొన్ని మాత్రమే ఉపయోగంలో ఉండగా మిగతావి శిథిలావస్థకు చేరడంతో నూతన కాంప్లెక్స్‌ల కడతామని మున్సిపల్ వారు రెండేళ్ల క్రితం అన్నింటిని కూల్చివేశారు. అయితే కూల్చి రెండేళ్లవుతున్నా ఇంత వరకు ఎలాంటి నిర్మాణం చేపట్టకపోవడంతో స్థలం ఖాళీగా ఉంది. దీంతో ఆ స్థలంలో ఎదురుగా ఉన్న ఓ రెస్టారెంట్, లాడ్జి వారు వారి దగ్గరకు వచ్చే కస్టమర్లకు పార్కింగ్ స్థలం మార్చుకొని వినియోగించుకుంటున్నారు. ఇదే విధంగా జాప్యం చేస్తే ప్రైవేటు వ్యక్తులు ఆ స్థలంను కూడా కబ్జా చేసే అవకాశం ఉంటుంది. కాంప్లెక్స్‌ల నిర్మాణం చేసే అవకాశం లేకుంటే ఎవరికైన లీజుకు స్థలం ఇచ్చిన మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది.

రైల్వే అండర్‌పైన ఖాళీ స్థలంలో గతంలో మున్సిపల్ పార్కు ఉండేది. ఆ పార్కు కొత్తగూడెంకు వన్నె తెచ్చే విధంగా ఉండేది. అయితే ఆ పార్కును రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ సమయంలో కూల్చివేశారు. అయితే మళ్లి ఇప్పుడున్న ఖాళీ స్థలంలోనే పార్కును నూతనంగా నిర్మించాలని గతేడాది పంపిణ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఆ ప్రాంతంలో పార్కు నిర్మాణం చేపట్టి, పిల్లలకు ఉపయోగపడే పరికరాలు, ఆట సామాగ్రి, పెద్దలకు ఉపయోగపడే సామగ్రిని అమ్మకాలు వంటివి చేస్తే చాలా మందికి ఉపాధితో పాటుగా మున్సిపాలిటీకి అదనంగా ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. వీటితో పాటుగా మున్సిపాలిటీలో మరెన్నో ఆదాయంను తెచ్చే ఖాళీ స్థలాలు ఉన్నాయి.

నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాలి

కొత్తగూడెం పట్టణ పరిధి సెవెన్‌హిల్స్ ఏరియాలో శిథిలావస్థలో ఉన్న కాంప్లెక్స్‌లను కూల్చివేసి, వాటి స్థానంలో కొత్తవి నిర్మించేందుకు మున్సిపల్ వారు చర్యలు చేపట్టారు. మున్సిపల్ వారు నిర్మాణాలకు నిధులను కేటాయించి కాంప్లెక్స్‌లను నిర్మిస్తే చాలా మందికి ఉపాధితో పాటుగా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది.

– కూసపాటి శ్రీనివాస్, చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటుచేయండి



వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

పాల్వంచరూరల్: పాల్వంచలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను పలువురు కోరారు. పాల్వంచకు శనివారం వచ్చిన ఆయనను తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) సెంట్రల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఏ.వజీర్, డి.రాధాకృష్ణ వినతిపత్రం అందజేశారు. కేటీపీఎస్ కర్మాగారం సముదాయంలో వందల ఎకరాల స్థలం, సమీపాన బొగ్గు, నీరు అందుబాటులో ఉన్నందున సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

కిన్నెరసాని ప్రాజెక్టు రిజర్వాయర్ మీద సోలార్ ప్యానళ్లతో పాటు కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో నూతనంగా 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. అలాగే, జెన్‌కోలో ఇంజనీర్లందరికీ బదిలీ అవకాశం కల్పించాలని, 1998–2004 మధ్య చేరిన జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని డి.ఉమామహేశ్వరరావు, యాస్మిన్, జయభాస్కర్, సంపత్, చంద్రకళాధర్, అరుణ్, నరేంద్ర, శ్రావణ్ తదితరులు వినతిపత్రం ఇచ్చారు. విద్యుత్ కేంద్రం విషయమై మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు కూడా డిప్యూటీ సీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, పైడిపల్లి మహేష్, కాల్వ భాస్కర్‌రావు, కనగాల నారాయణ, సాదం రామకృష్ణ, వెంకటాచారి, శాంతి, కాపా శ్రీను, సత్యనారాయణ, కోటి, గంగిరెడ్డి భువనసుందర్‌రెడ్డి, చాంద్‌పాషా ఉన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్ఎండీసీ కర్మాగారాన్ని పునరుద్ధరించి విస్తరణ చేసి నిరుద్యోగ, యువతి, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరుతూ ఎన్ఎండీసీ పూర్వ కార్మికులు, ఐఎన్‌టీయూసీ నాయకులు బాలునాయక్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రంన్ని అందజేశారు.

చుంచుపల్లి: జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి సమస్యల పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. నిధులు లేక పంచాయతీల్లో పాలన సక్రమంగా జరగడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శి వంశీకృష్ణతో పాటు రవికుమార్, రాంబాబు, బాబురావు, శ్రీబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీల నుంచి లంబాడీలను తొలగించాలి



సమావేశమైన నాయకులు

ఇల్లెందు: ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇల్లెందులో తుడుందెబ్బ, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు మహాగర్జన సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆదివారం ఇల్లెందులో నిర్వహించనున్న ఆదివాసీ మహాగర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు 15 రోజుల పాటు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించామన్నారు. ఈ సభ ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలిగించాలని డిమాండ్‌తో జరుగబోతుందని, ఆదివాసీ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గొగ్గెల రామస్వామి, కొడెం వెంకటేశ్వర్లు, ముక్తి రాజు, సనప కోటేశ్వరరావు, నాయకులు జోగ రాంబ్రహ్మం, బుగ్గ రామనాథం, మెట్ల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఆధ్యాత్మిక సందడి..



బొంబాయితండాలో బోనాలతో తరలివస్తున్న మహిళలు

ఇల్లెందురూరల్: మండలంలోని పోచారంతండా, బొంబాయితండా గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభతో పండుగ వాతావరణం నెలకంది. పోచారంతండా గ్రామంలో ఆంజనేయస్వామి, నాభిశిల, బొంబాయితండా గ్రామంలో నాభిశిల ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు ఘనంగా చేసుకున్నారు. ఈ మేరకు ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఉండటంతో శనివారం భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట వేదికల వద్ద పూజలు, హోమాలు చేశారు. బొంబాయితండా గ్రామంలో మహిళలు భారీ సంఖ్యలో బోనాలతో తరలివచ్చి నైవేద్యం సమర్పించారు.



హోమ పూజలు..

ఘనంగా పెద్దమ్మతల్లి జాతర

చుంచుపల్లి: మండల పరిధిలోని చుంచుపల్లి తండాలో శనివారం పెద్దమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. రెండేళ్లకొకసారి జరిగే ఈ జాతర సందర్భంగా అక్కడ పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడవిలోని పెద్దగుట్ట నుంచి సర్వేల్ కర్రలను తీసుకొచ్చి గుడి చుట్టూ మూడు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ఊరేగింపు వేడుకల్లో అనేక మంది యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ జాతరలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



చుంచుపల్లి: జాతరలో భక్తజన సందోహం

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



నూతన ఇండక్షన్ టెస్టర్‌ను చూపిస్తున్న ఏడీఈ కోటేశ్వరరావు

ఇల్లెందురూరల్: వర్షాకాలం ప్రారంభమవుతున్న వేళ విద్యుత్ సంబంధిత ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఈ సమయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావు సూచించారు. ఈ మేరకు ట్రాన్స్‌కో సబ్‌డివిజన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభ సూచికగా ఏర్పడే ఈదురుగాలులు, ప్రకృతి వైపరిత్యాల వల్ల విద్యుత్ తీగలు తెగిపోవడం, సాగడం, స్తంభాలు విరగడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, ఎర్తింగ్ విఫలం కావడం తదితర లోపాలు ఏర్పడిన సమయంలో విద్యుత్ ప్రమాదాలకు అవకాశం ఉంటుందన్నారు. వీధుల్లో సాంకేతిక నైపుణ్యం లేకున్నా ట్రాన్స్‌ఫార్మర్లకు ఫ్యూజులు మార్చడం, సర్వీసు వైర్లు, వీధి దీపాలను సరిచేయడం వంటి పనులు చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రైతులు వ్యవసాయ పంపుసెట్లను వినియోగించేటప్పుడు కరంటు మోటార్ల ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ ఎలా ఉందో సరిచూడాలన్నారు. ఇంటి ఆవరణలో బట్టలు ఆరేసేందుకు దండంగా కట్టిన జీఐ వైర్‌కు విద్యుత్ ప్రసారం జరిగే వైర్లు కలవడం వల్ల చాలా మంది విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఎక్కడైనా విద్యుత్ ప్రసారాన్ని గుర్తించేందుకు నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఇండక్షన్ టెస్టర్‌ను ప్రజలు వినియోగించాలని సూచించారు.

పేదలకు ఇళ్లు దక్కే వరకు పోరాటం



ధర్నా చేస్తున్న కాలనీవాసులు, నాయకులు

చుంచుపల్లి: పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు దక్కేవరకు పోరాటం కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. కొమరం భీం కాలనీలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కాలనీ నుంచి చుంచుపల్లి తహసీల్దార్ ఆఫీస్ వరకు శనివారం ప్రదర్శన, అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ఏడేళ్ల నుంచి ఇళ్లు లేని పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, ప్రభుత్వాలు మారుతున్న వీరికి ఇళ్ల స్థలాలు మాత్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎన్నికలకు ముందు పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని హామీ ఇస్తూ గెలిచిన తర్వాత ఓడ దాటాక బోడ మల్లయ్య అన్న చందంగా కొందరు రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనంతరం కార్యాలయం ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, నాయకులు డి.వీరన్న, బాలకృష్ణ, రాములు, రఘు, రమ, సంధ్య, నాగదుర్గ, రుహీనా, రసూల్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటుపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో అధికారులు, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ఏరియాలో రక్తపోటుపై ఏరియా జీఎం కార్యాలయంలో మెడికల్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారి లలిత ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతీ ఒక్కరు మంచి ఆరోగ్య అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరు రక్తపోటుకు సంబంధించిన వివరాలను కచ్చితంగా తెలుసుకోవాలన్నారు. గుండెకు సంబంధించిన ప్రమాదాల కారకాల్లో రక్తపోటు ప్రధాన మైందన్నారు. కొంతమందికి రక్తపోటు అర్థమవుతుందని, కొందరికి తొందరగా కాదని అందుకే తరచుగా పరీక్ష చేసుకుంటూ మంచి ఆహారపు అలవాట్లను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఇష్టపడి కొంటున్నా.. తినకపాయే

- మామిడిపండులో 'పండు ఈగ'
- కొని నష్టపోతున్న వైనం



కుళ్లిపోయిన మామిడికాయలు


ఇల్లెందు: ఏడాదిలో ఒకదఫా పంట పండే మామిడిలో 'పండుఈగ' రోగం మామిడి ప్రియులను కలవరపరుస్తుంది. పసుపు వర్ణంలో పక్వానికి వచ్చి పండిన మామిడి కాయ బయటకు నిగనిగలాడుతున్నా తీకా కోస్తే లోన కుళ్లిపోయిన దృశ్యం ఉంటుంది. అది చూసిన మామిడి ప్రియులు ఖంగుతింటున్నారు. ఇలా చాలా కాయలు కుళ్లిపోయి ఉంటున్నాయి. పైకి మాత్రం నిగనిగ పండి పక్వానికి వచ్చి కనిపిస్తున్నాయి. కుళ్లిన పండ్లుకొని వినియోగదారులు లబోదిబోమంటున్నారు. ఈ మేరకు ఇల్లెందులో రోడ్డు వెంట కొనుగోలు చేసిన మామిడి పండ్లు కుళ్లి ఉండటం చూసి చాలా మంది మామిడి ప్రియులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై హార్టికల్చర్ అధికారులను వివరణ కోరగా పండుఈగ రోగం అంటారని, పిందె దశలో మందులు కొట్టని తోటలకు ఇలాంటి జబ్బులు వస్తాయని తెలిపారు.

నేడు బీఎంఎస్ ఆధ్వర్యంలో తిరంగాయాత్ర

సింగరేణి(కొత్తగూడెం): ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని సైనికులకు సంఘీభావం తెలిపేందుకు నేడు (ఆదివారం) కొత్తగూడెంలోని పాలకేంద్రం నుంచి సూపర్‌బజార్ వరకు బీఎంఎస్ ఆధ్వర్యంలో తిరంగాయాత్ర నిర్వహించనున్నట్టు సంఘం జాతీయ కార్యదర్శి, తిరంగా ఆహ్వాన కమిటీ నిర్వాహకులు పి.మాధవ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశరక్షణలో సైనికుల త్యాగాన్ని స్మరించేందుకు, ఐక్యతను చాటేందుకు నిర్వస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి పిలుపు మేరకు చేపడుతున్న ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తూర్పుగూడెం వాగుపై.. హై లెవల్ బ్రిడ్జి నిర్మించరూ..

- చప్టాలో కొంతభాగం కొట్టుకుపోయిన వైనం
- వరదొస్తే రాకపోకలు బంద్



తూర్పుగూడెం వాగు



కొట్టుకుపోయిన చప్టా

టేకులపల్లి: మండలంలోని పెగళ్లపాడు పంచాయతీ తూర్పుగూడెం గ్రామంలోని వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు వేడుకుంటున్నారు. వర్షాకాలంలో టేకులపల్లి, సుజాతనగర్ రెండు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టేకులపల్లి నుంచి స్టేషన్ బేతంపూడి, సుజాతనగర్, ఏన్కూరు, కొత్తగూడెం తదితర గ్రామాలు, పట్టణాలకు వెళ్ళేందుకు, అటు నుంచి టేకులపల్లి, ఇల్లెందు, గుండాల వైపు వెళ్లేందుకు తూర్పుగూడెం గుండా వెళ్తే దూరాభారం తగ్గిస్తుంది. కానీ వర్షాకాలంలో వాగు దాటి వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. వాగుపై ఉన్న చప్టాపై నుంచి వెళ్లే వరద ఉధృతికి రాకపోకలు నిలిచిపోతాయి. ప్రస్తుతం ఉన్న చప్టాపైన కొంత భాగం గతంలో వచ్చిన వరదలో కొట్టుకుపోయింది. మిగిలిని భాగం భారీ వర్షాలు, వరదలు వస్తే మునిగిపోయి ఉధృతంగా వరద పారుతుంది. దీంతో రాకపోకలు నిలిచిపోతాయి. ఈ వాగుకు అవతలే తూర్పుగూడెం గ్రామానికి చెందిన రైతుల వందల ఎకరాల సాగు భూములు ఉన్నాయి. ఇక వరద సమయంలో రైతుల అవస్థలు వర్ణనాతీతం. గత వర్షాకాలంలో ఓ కారు అదుపు తప్పి నీటిలో పడటంతో స్థానికులు బయటకు తీశారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా ఇక్కడ హైలెవల్ బ్రిడ్జి మాత్రం మంజూరు కావడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలి



తూర్పుగూడెం గ్రామానికి చెందిన వందల ఎకరాల సాగుభూములు వాగుకు అవతలే ఉన్నాయి. వర్షాకాలం వరద ఉధృతి తీవ్రంగా ఉంటుంది. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లి రావడం కష్టంగా ఉంది. ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక చొరవ తీసుకుని వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలి.

– పూనెం నరసింహారావు, తూర్పుగూడెం